


అయ్యప్ప స్వామికి పల్లకీ సేవ

బాపట్ల: భీమవారిపాలెంలోని కోదండరామాలయంలో గురువారం అయ్యప్ప పల్లకీ సేవ నిర్వహించారు. 300 మంది స్వాములు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ పల్లకీ మోశారు.



ఐలవరంలో నగర సంకీర్తన

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం గ్రామంలో ధనుర్మాసం పురస్కరించుకుని ప్రతిరోజూ నగర సంకీర్తన జరుగుతుంది. సంకీర్తనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 578.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,298 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వణికిస్తున్న అల్పపీడనం

- రెండు రోజులుగా మేఘావృతం
- అక్కడక్కడా చిరు జల్లులు
- వర్షం కురిస్తే ధాన్యం రాలిపోయి పంట దెబ్బతినే అవకాశం
- పాలు దశలో ఉన్న వరికి తీవ్ర నష్టం
- పంట కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు
- రైతులపై ఆర్థిక భారం



చెరుకుపల్లిలో బస్తాల్లో నింపిన ధాన్యం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతులను వణికిస్తోంది. పది రోజులుగా దాదాపు ఇదే పరిస్థితి. బుధవారం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతమైంది. అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తున్నాయి. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కూలీలకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో రైతులపై ఆర్థిక భారం పడుతుంది. బాపట్ల డివిజన్ పరిధిలో 49,489 ఎకరాలు, చీరాల డివిజన్‌లో 18,990 ఎకరాలు, రేపల్లె డివిజన్‌లో 1,19,173.57 ఎకరాల చొప్పున మొత్తం 1,87,647.50 ఎకరాలలో వరిపంట కోత, పాలు, గింజ దశలో ఉంది. రెండు మూడు రోజుల్లోనే కోత కోయాల్సిన వరిపంట దాదాపు 25 వేల ఎకరాలు ఉంది. ఈ నెలాఖరు నాటికి దాదాపుగా కోతలు పూర్తికానున్నాయి. ఈ సమయంలో వర్షం కురిస్తే కోతకు వచ్చిన పంట పూర్తిగా నేలవాలుతుంది. పాలు, గింజ దశలో ఉన్న వరి గింజ తాలుపోయి దిగుబడి పూర్తిగా తగ్గిపోయి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండదు. ఏం చేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కోద్దామనుకున్నా మబ్బులతో ధాన్యం ఆరబెట్టుకోలేని పరిస్థితి. పోనీ పచ్చి ధాన్యాన్ని ప్రభుత్వమైనా కొంటుందనుకుంటే అదీ లేదు. ఇన్నాళ్లు చమటోడ్చి కాపాడుకుంటూ వచ్చిన వరి పంట కళ్ల ముందు వరుణుడి పాలైతే పెట్టుబడులు కూడా నష్టపోవాల్సి వస్తుంది. ప్రధానంగా రైతుల్లో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. వారంతా ఎకరానికి దాదాపు రూ.30 నుంచి రూ.40 వేలు కౌలు చెల్లించడమే కాక పెట్టుబడి పెట్టారు. అకాల వర్షం కురిస్తే పంటపోయి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశముంది. ఇప్పటికే పలు రకాల ఆంక్షలతో ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వక పోవడంతో రైతులు ప్రధానంగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆంక్షలు సడలించి ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు(మద్దతు ధర) కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చలి గాలులు

అల్పపీడన ప్రభావంతో చలి గాలులు వీస్తున్నాయి. దీంతో సాధారణ ప్రజలు చలి తీవ్రతకు వణుకుతున్నారు. బయటకు రావటానికి భయపడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.



బాపట్ల ప్రాంతంలో కోత దశలో వరి పంట



చెరుకుపల్లి ప్రధాన రహదారిపై ఆరబోసిన ధాన్యం



భట్టిప్రోలు-వెల్లటూరు రహదారిలో ఆరబోసిన ధాన్యం

రెండు గ్రామాల మధ్య చిచ్చు రేపిన ఇసుక మాఫియా

- ఏకమైన బచ్చులవారిపాలెం గ్రామస్తులు
- ఇసుక ట్రాక్టర్ ఢీ కొనడంతో బైక్‌పై వెళుతున్న వ్యక్తికి తీవ్రగాయాలు

వేటపాలెం:ఇసుక మాఫియా కారణంగా బచ్చులవారిపాలెం, చల్లారెడ్డిపాలెం గ్రామాల మధ్య చిచ్చు రేగింది. వివరాల్లోకి వెళితే.. వేటపాలెం మండల పరిధిలోని బచ్చులవారిపాలెం గ్రామం దగ్గరలో అసైండ్ భూముల్లో అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో ఇసుక తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి బచ్చులవారిపాలెం గ్రామానికి చెందిన బచ్చుల పవన్ కళ్యాన్ వేటపాలెం నుంచి తన గ్రామానికి బైక్‌పై వెళతున్న సమయంలో ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న పవన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగ్రాత్రుడిని చీరాల వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. కాగా చల్లారెడ్డిపాలేనికి చెందిన ట్రాక్టర్ యజమాని అతని కుమారుడు బచ్చులవారిపాలెం గ్రామానికి వెళ్లారు. ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన యువకుడి బావ నాగరాజు వారితో వాదన పెట్టుకున్నాడు. గ్రామం నుంచి ప్రతిరోజూ రాత్రి సమయంలో ఇసుక తరలించడం వల్ల మా గ్రామంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాక్టర్ యజమానిని నిలదీశాడు. దీనిపై ట్రాక్టర్ యజమాని, అతని కుమారుడులు నాగరాజుతో ఘర్షణ పడ్డారు. మీ కుర్రాడు కావాలని ట్రాక్టర్‌కి అడ్డుగా వచ్చాడని వాదనకు దిగారు. ఇరువురు ఘర్షణ పడిన అనంతరం ట్రాక్టర్ యజమాని, అతని కుమారుడులు నాగరాజుపై దాడి చేసి వెళ్లిపోయారు. ఈ సంఘటన చూసిన గ్రామస్తులు.. చల్లారెడ్డిపాలెం నుంచి వచ్చి మన గ్రామంలో ఇసుక అక్రమంగా తరలించుకొని వెళ్లడంతోపాటు మన గ్రామం వారిపై దాడికి పాల్పడతారా అంటూ గ్రామస్తులంతా ఏకమయ్యారు. బచ్చులవారిపాలెం గ్రామస్తులు నాగరాజుపై దాడికి పాల్పడిన ట్రాక్టర్ యజమానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇక నుంచి తమ గ్రామంలో ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్ ఇసుక తోలడానికి వీలు లేదని తీర్మానించుకున్నారు. దీనిపై గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

న్యూస్‌రీల్

మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ

పేషెంట్ నుంచి డబ్బు వసూలుపై విచారణ



మార్టూరు: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన పేషెంట్ నుంచి డబ్బు వసూలు చేసిన సిబ్బంది ఘటనపై జిల్లా వైద్యాధికారి శేషుకుమార్ గురువారం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వలపర్ల గ్రామానికి చెందిన తన్నీరు రేణుక భర్త దాడి చేసిన విషయమై బుధవారం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన సంగతి తెలిసిందే. చికిత్సలో భాగంగా ఆమెకు అవసరమైన డైనో ప్లాస్టర్ ఆసుపత్రిలో లేనందున బయట నుంచి కొనుగోలు చేయాలని ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ శివ నాయక్ కోరాడు. దీనికి గాను పేషెంట్ నుంచి రూ.200 వసూలు చేసిన సంగతి పత్రికల్లో గురువారం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి శేషుకుమార్ గురువారం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జరిగిన విషయాన్ని నిర్ధారించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. డైనో ప్లాస్టర్ మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సరఫరా లేని మాట నిజమేనని అయితే.. పేషెంట్ నుంచి నగదు వసూలు చేసి చికిత్స చేయటం సమంజసం కాదన్నారు. పేషెంట్ రేణుక విషయంలో బుధవారం జరిగిన సంఘటన పట్ల విచారిస్తున్నామని.. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమయానికి ఆసుపత్రిలో లేని మందులు లేదా మెటీరియల్ ఆసుపత్రి బడ్జెట్లోనే కొనుగోలు చేయించి పేషెంట్లకు చికిత్స అందిస్తామని తెలిపారు.

9 మందికి ఐదేళ్ల కారాగార శిక్ష

బాపట్ల: పొన్నూరులోని కోదండ రామాలయం నిధుల విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంలో 9 మందికి ఐదేళ్ల వంతున కారాగార శిక్ష విధిస్తూ బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి గురువారం తీర్పు చెప్పారు. 2019లో దేవాలయం నిధుల విషయంలో 17 మందిపై పొన్నూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై వాదోపవాదాలు జరగగా 9 మందికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలవరించారు.

తాడికొండ- కంతేరు రోడ్డుకు మరమ్మతులు



తాడికొండ: తాడికొండ- కంతేరు రోడ్డుకు ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. 4 నెలల క్రితం వచ్చిన భారీ వరదలకు కొండవీటి వాగుకు వరద పోటెత్తి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మరమ్మతులు పేరుతో టీడీపీ నాయకులు రాళ్లు, ఫ్లైయాష్ డస్ట్ వేసి చేతులు దులుపుకోగా నాటి నుంచి నేటి వరకు పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. సాక్షిలో కథనాలు ప్రచురితం కావడంతో ఎట్టకేలకు స్పందించిన అధికారులు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.

ప్రతి రైతుకు యూనిక్ ఐడీ



ఫిరంగిపురం: ప్రతి రైతుకు యూనిక్ ఐడీ నంబరును సిబ్బంది తప్పని సరిగా ఇవ్వాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. నుదురుపాడు సచివాలయం వద్ద గురువారం వ్యవసాయ శాఖ, కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రైతులకు ప్రత్యేక ఐడీ నంబరు ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఢిల్లీరావు మాట్లాడారు. మండలంలోని నుదురుపాడు, మేరికపూడి, గుండాలపాడు, వేమవరం గ్రామాలను కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు చెప్పారు. దీని ద్వారా గ్రామాల్లోని రైతులందరికి గ్రామ వ్యవసాయ సహాయకులు, ఇతర సిబ్బంది యూనిక్ ఐడీ ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద రూ.6 వేల గ్రాంటు ఇస్తారని తెలిపారు. వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ కె.విజయలక్ష్మి, సంయుక్త సంచాలకుడు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు టి.శ్రీనివాసరావు, ఏవో వాసంతి, సుభాని ఉన్నారు.

నా మార్గం కమ్యూనిజం



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ

సాక్షి అమరావతి: తన మార్గం కమ్యూనిజమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. విశాలాంధ్ర ప్రచురించిన 'దీపిక' రచన ద్వారా కేంద్ర అవార్డును అందుకోవడం గర్వకారణమన్నారు. విజయవాడ విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో గురువారం చంద్రం బిల్డింగ్స్‌లో లక్ష్మీనారాయణకు సన్మానం చేశారు. 1974 నుంచి అరసంలో ఉన్న తనకు విశాలాంధ్రతో అనుబంధం కొనసాగుతోందన్నారు. 150కిపైగా పుస్తకాలకు సంకలనకర్తగాను, గౌరవ సంపాదకులుగా వ్యవహరించానని అన్నారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో మార్పులు రావాలని పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం మరింత బలపడాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, విశాలాంధ్ర దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు, పి.హరినాథ్‌రెడ్డి, చావా రవి తదితరులు మాట్లాడుతూ.. లక్ష్మీనారాయణకు ఈ అవార్డు రావడం గర్వకారణమన్నారు. ఆయన్ను అభినందించారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల
అధ్యక్షుల నియామకం



రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలలో రేపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులకు చోటు లభించింది. రేపల్లె నియోజకవర్గనాకి చెందిన పలువురిని అనుబంధన విభాగాలకు అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులుగా నసీరున్నీసా బేగం, క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడుగా సముద్రాల ప్రభుకిరణ్, వీవర్స్ విభాగం అధ్యక్షుడుగా వంగర భానుప్రసాద్, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడుగా తోకల రాజాలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వేమూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియోజకవర్గానికి చెందిన పలువురిని నియమించినట్లు పార్టీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు గురువారం తెలిపారు. వలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షులుగా అరమళ్ల పవన్ కుమార్‌రెడ్డి, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షులుగా విష్ణు మొలకల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు చలంచర్ల కనకదుర్గ, సోషల్ మీడియా విభాగం అధ్యక్షులుగా వాసుమళ్ల రోహిత్‌ను నియమించినట్లు తెలిపారు.

బాపట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకాలు చేపట్టారు. బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా కొక్కిలిగడ్డ చెంచయ్య, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులుగా యేట్రా అశ్వనీరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులుగా యల్లావుల సోహిత్, లీగల్ సెల్ అధ్యక్షులుగా కంచర్ల రవిబాబు, దివ్యాంగుల విభాగం అధ్యక్షులుగా చల్లా రామయ్య, పబ్లిసిటి విభాగం జిల్లా అధ్యక్షులుగా వడ్డిముక్కల డేవిడ్‌ను నియమించారు.

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అనుబంధ విభాగాలకు సంబంధించి చీరాల నియోజకవర్గంలో పలువురికి పార్టీ అధ్యక్ష పదవులను అందించారు. చీరాల నియోజకవర్గం బీసీ విభాగం అధ్యక్షునిగా గవిని శ్రీనివాసరావు, ఎస్సీ విభాగం అధ్యక్షునిగా వాసిమళ్ల వాసు, మున్సిపల్ విభాగం అధ్యక్షునిగా మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల అనిల్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా మున్సిపల్ కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణలు నియమితులయ్యారు. పదవులు రావడానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్ల జాబితా తయారీకి సంసిద్ధంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీకి సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. యువ ఓటర్ల నమోదుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సాధారణ జనాభాకు ఓటర్ల జాబితా నిష్పత్తిని సరి చూసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో లింగ బేధం పరిశీలించాలని, ఆరోగ్యకరమైన నిష్పత్తి ఉండాలన్నారు. 57,034 మంది యువతీ యువకులు ఓటు హక్కు లేకుండా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించిన అంశంపై ఆయన ఆరా తీశారు. కళాశాలలు మాత్రమే గాకుండా వివిధ రంగాలలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వివిధ వృత్తుల్లో ఉండే వారిని సైతం గుర్తించి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తదుపరి అభ్యంతరాల స్వీకరణ సమయంలో అందిన దరఖాస్తులలో 1,063 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఈనెల 24వ తేదీలోగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నేటికీ మృత ఓటర్లు 1,116 తొలగించాల్సి ఉందన్నారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడంలో అద్దంకి, పర్చూరు నియోజకవర్గ అధికారుల పనితీరు మెరుగు పడలేదన్నారు. నిర్లిప్తంగా ఉంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటు హక్కుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ 83 శాతమే ఉందని, ప్రతి ఓటుకు ఆధార్ అనుసంధానించాలన్నారు. రెవెన్యూ సదస్సులలో నమోదైన ప్రతి అర్జీని పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. జనవరిలో రెవెన్యూ రీజనల్ సదస్సు ఉంటుందని, ఆ సమయానికి సమస్యలు పెండింగ్‌లో ఉండరాదని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

జిల్లాలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశం అంశాలపై జిల్లా అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. ప్రభుత్వ ఉద్దేశాలకు అనుగుణంగా అధికారులందరూ పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమా, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దెబోరా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, జిల్లా వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ దేవదత్తు పాల్గొన్నారు.

కళాశాల బస్సు.. ట్యాంకర్ ఢీ

జాతీయ రహదారిపై త్రుటిలో తప్పిన ప్రమాదం

మార్టూరు: జాతీయ రహదారిపై గురువారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. నరసరావుపేటకు చెందిన ఓ ప్రైవేట్ కళాశాల బస్సు మార్టూరు జాతీయ రహదారిపై స్థానిక హీరో షోరూం వద్ద రహదారిపై నుంచి సర్వీస్ రోడ్డులోకి మలుపు తిరుగుతోంది. ఈ క్రమంలో గుంటూరు వైపు నుంచి ఒంగోలు వెళుతున్న వాటర్ ట్యాంకర్ రహదారిపై రివర్స్ అవుతున్న కళాశాల బస్సును వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ పరిణామానికి బస్సులో ఉన్న కళాశాల విద్యార్థులు, స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రమాదం ధాటికి కళాశాల బస్సు.. ట్యాంకర్ అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో విద్యార్థులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



అద్దాలు ధ్వంసమైన వాటర్ ట్యాంకర్

అసంబద్ధ విధానాలకు ఉపాధ్యాయులు బలి



జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జడ వినయ్‌కుమార్

బాపట్లటౌన్: ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ విధానాలకు ఉపాధ్యాయులు బలౌతున్నారని యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ గురువారం ఉపాధ్యాయులతో కలిసి జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆది నుంచి పాఠశాల విద్యా వ్యవస్థలో అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు అసంబద్ధంగానే ఉంటున్నాయన్నారు. కరోనా సమయంలో వందల మంది ఉపాధ్యాయులు చనిపోవడం మనం చూశామని, కొత్తగా వచ్చిన ప్రభుత్వమైనా ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేస్తుందని ఆశించామని, కానీ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి మండల స్థాయిలో తేలిగ్గా జరగాల్సిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు కార్యక్రమాన్ని పెద్ద ప్రహసనంగా జరిపారని అన్నారు. శిక్షణల పేరుతో రెండు మూడు జిల్లాల ఉపాధ్యాయులను కలిపి సుదూర ప్రాంతాల్లో రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌గా జరుపుతున్న సందర్భంలో ఉన్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారుల మొండివైఖరి వల్ల ఇద్దరు ప్రధానోపాధ్యాయులు మరణించారని తెలిపారు. నేడు ప్రశ్నపత్రాలు ఉన్నత పాఠశాలలకు చేర్చండని కోరితే పోలీస్‌స్టేషన్ అని, ఎంఆర్సీ అని గందరగోళం చేశారని, ఈ రోజు ఏమ్మార్సీ నుంచి ప్రశ్నపత్రాలు తీసుకు వస్తుండగా చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం తలపులపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శెట్టి సిద్దయ్య ప్రమాదంలో దుర్మరణం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

166 గోవా మద్యం బాటిళ్లు స్వాధీనం



వేటపాలెం: దేశాయిపేట పంచాయతీలో ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన ఇట్లా శ్రావణి అలియాస్ దుర్గను అదుపులోకి తీసు న్నట్లు ఎక్సైజ్ ఎస్సై బి.శ్రీహరి గురువారం తెలిపారు. ఆమె వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 166 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దేశాయిపేట సాయిబాబా గుడి ఆర్చి వద్ద గల పూరి గుడెసెలో మద్యం బాటిళ్ల దాచి ఉంచారని తెలయజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగుల ధర్నా



నరసరావుపేట: విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ విరమించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బరంపేటలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం గేటు ముందు ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా ఎన్‌సీసీఓఇఇ పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. కార్యాచరణ సమితి సభ్యులు ఆర్ బంగారయ్య, జేఏసీ నాయకులు కె.రవిశంకర్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాదరావు కేవీఆర్ఎస్ శ్రీనివాసరావు, అన్ని వర్గాల విద్యుత్ ఉద్యోగులు, మహిళ ఉద్యోగులూ పాల్గొన్నారు.

విద్యార్థులతో నమోదు చేయించాలి

గుంటూరుఎడ్యుకేషన్: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చా కార్యక్రమానికి జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని హైస్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో నమోదు చేయించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎరువుల దుకాణాలలో తనిఖీలు

భట్టిప్రోలు: ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు నాణ్యమైనవి విక్రయించకుంటే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడీఏ సుదర్శనరాజు (సీడ్స్) హెచ్చరించారు. భట్టిప్రోలులోని పలు ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాలలో తనిఖీలు నిర్వహించి బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లు, ఎరువులు, పురుగు మందు నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో భట్టిప్రోలు ఏవో జి.మీరయ్యతోపాటు బాపట్ల వ్యవసాయశాఖ కార్యాలయం టెక్నికల్ ఏఓ ఎ.తిరుమలరావు, తూర్పుగోదావరి జిల్లా నల్లచర్ల ఏఓ కమలరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: రైతులకు నాణ్యతతో కూడిన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ కేవి సుదర్శనరాజు చెప్పారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం వ్యవసాయశాఖల అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. సుదర్శనరాజు మాట్లాడుతూ రైతులకు అందించే వస్తువులతో పాటు రశీదులను తప్పనిసరిగా అందించాలన్నారు. ఎంఆర్‌పీ కన్నా అధికంగా విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి దుకాణం ముందు స్టాక్ బోర్డు, ధరల బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాలలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ ఆర్.విజయ్‌బాబు, బాపట్ల వ్యవసాయ కార్యాలయం డీఏవో ఏ.తిరుమలరావు, నల్లజర్ల ఏవో కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



కర్లపాలెంలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

స్టాక్ నిల్వలు సక్రమంగా ఉండాలి

కర్లపాలెం: ఎరువుల దుకాణాల వద్ద స్టాక్ సక్రమంగా ఉండాలని ఎరువుల తనిఖీ స్క్వాడ్ ఏడీఏ సుదర్శనరాజు పేర్కొన్నారు. కర్లపాలెంలో ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. రైతుల వేలిముద్రలు తీసుకుని ఎరువులు విక్రయాలు చేయాలని సూచించారు. ఈపీఎస్ఓ మెషిన్‌లో స్టాక్, భౌతిక నిల్వలతో సమానంగా ఉండాలని సూచించారు. స్టాక్ నిల్వలు ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్క్వాడ్‌తోపాటు వ్యవసాధికారులు కమలరాజు, సుమంత్‌కుమార్ ఉన్నారు.

ఏఆర్ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

కేక్ కట్‌చేసిన ఎస్పీ తుషార్ దూడీ

బాపట్లటౌన్: జిల్లాలోని పోలీస్ సిబ్బంది కుటుంబ సమేతంగా సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించుకోవడం హర్షనీయమని జిల్లా ఎస్పీ తుషార్ దూడీ అన్నారు. జిల్లా ఏఆర్ కార్యాలయంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. తొలుత చిన్నారులతో కలిసి సెమీ క్రిస్మస్ కేక్‌ను ఎస్పీ కట్ చేశారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు క్రిస్మస్, న్యూ ఇయర్ శుభాకాంక్షలతోపాటు క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ నిర్వహించారు. ఎస్పీ తుషార్ దూడీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సమేతంగా హాజరవడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రిస్మస్ పండుగ శాంతి, సంతోషానికి, త్యాగానికి, ప్రేమ, కరుణకు తార్కాణంగా జరుపుకుంటామన్నారు. క్రీస్తు జీవనగమనం అందరికీ ఆచరణీయమని అన్నారు. క్రిస్మస్ పండుగ రోజును సంతోషంగా, ఆహ్లాదకర వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాక్షించారు. క్రీస్తు బోధనలు మంచి మార్గంలో నడిపిస్తాయన్నారు. అందరూ ఐకమత్యంతో మెలుగుతూ ఎదుటివారిని క్షమించే గుణాన్ని అలవరచుకోవాలన్నారు. పోలీసులు ఎప్పుడూ ఉద్యోగ రీత్యా ఒత్తిడిని ఎదుర్కొంటూ ఉంటారని, వారికి వారి కుటుంబ సభ్యులు వెన్నుదన్నుగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఏ.ఓ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ఆర్‌ఐలు మౌలుద్దీన్, శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎస్పీ తుషార్ దూడీ

విద్యుత్ ఆదాతో భావితరాలకు మేలు



గుంటూరు వెస్ట్: భావితరాలు మనుగడ సాగించాలంటే ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే విద్యుత్ ఆదా చేయాల్సిన సామాజిక బాధ్యత ఉందని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ర్యాలీని కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ ఆదాపై అనేక అవగహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తక్కువ విద్యుత్ వినియోగంతో పనిచేసే గృహోపకరణాలు ప్రజలు వినియోగించాలని సూచించారు. సౌర విద్యుత్‌ను కూడా విస్తృతంగా ఉపయోగించుకోవాలి. పీఎం సూర్య గృహ పథకం కింద జిల్లాలో ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు ఇప్పటివరకు 5,900 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 594 మంది ఇన్‌స్టాలేషన్ చేయించుకున్నట్లు పేర్కొన్నారు.

విదర్భపై రాజస్థాన్ విజయం



మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో కల అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న విజయ్ మర్చంట్ ట్రోఫీలో రాజస్థాన్ జట్టు విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ జట్టు 205 పరుగులు సాధించగా, రాజస్థాన్ జట్టు 159 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్‌లో విదర్భ జట్టు 141 పరుగులు సాధించగా, రాజస్థాన్ 188 పరుగులు చేసి గెలిచింది. రాజస్థాన్ బ్యాట్స్‌మెన్ ఆదిత్య అగర్వాల్ 65 పరుగులతో రాణించాడు. రాజస్థాన్ జట్టు 5 వికెట్లు తేడాతో విజయం సాధించింది.

జిల్లా ఖోఖో జట్టు శిక్షణ పూర్తి

జె.పంగులూరు: స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో గత 20 రోజుల నుంచి ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యాన అండర్-19 ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్టు శిక్షణ తీసుకుంటోంది. గురువారం రాష్ట్ర ఖోఖో కార్యదర్శి, కళాశాల పీడీ మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ముగింపు జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న జట్టు ఈనెల 20, 21, 22 తేదీల్లో తిరుపతి జిల్లా పుత్తూరులో జరిగే అండర్-19 బాలుర స్కూల్ గేమ్స్ పోటీల్లో ఖోఖో పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో జట్టు మంచి ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని కోరారు. అనంతరం పీడీ సీతారామిరెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు, కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి సహకారంలో శిక్షణ జరిగినట్లు తెలిపారు. అండర్-19 ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు 24 సంవత్సరాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు వస్తున్నట్లు తెలిపారు. వీరికి క్రీడా దుస్తులు ప్రభుత్వం సహకారంతో సమకూర్చినట్లు తెలిపారు. ఈ జట్టు ప్రథమ స్థానం సాధించాలని బాపట్ల ఆర్ఐఓ సైమన్, డీఐఈఓ ఎర్రయ్య కోరారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు డేవిడ్ రాజు, లోకేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం జిల్లా బాలుర జట్టు

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

సాయంత్రానికే గుర్తించిన పోలీసులు

అద్దంకి రూరల్: ఉదయం తప్పిపోయిన బాలుడిని సాయంత్రానికి అద్దంకి పోలీసులు వెతికి పట్టుకొచ్చిన సంఘటన గురువారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ తెలిపిన వివరాల మేరకు .. అద్దంకి పట్టణానికి గొట్టిపాటి శ్రీధర్ కుమారుడు గొట్టిపాటి ఓంకార్ స్థానిక బెల్ అండ్‌బెన్నెట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలకు సైకిల్‌పై వెళ్లిన ఓంకార్.. స్కూల్‌కు వెళ్లే దారిలో సైకిల్, పుస్తకాల బ్యాగ్ పడవేసి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ కుమారుడు తప్పిపోయాడా లేక కిడ్నాప్‌కు గురయ్యాడా అని భయాందోళనతో సీఐకి సమాచారం ఇవ్వడంతో సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్ బాషాల ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి అద్దంకి పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఆ బాలుడు సాయంత్రం ఒంగోలు బస్టాండ్‌లో కనబడటంతో తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎలా వెళ్లావని బాలుడిని అడగ్గా తాను ఒక్కడినే అద్దంకి బస్టాండ్ నుంచి శ్రీశైలం వెళ్లే బస్సు ఎక్కి ఒంగోలు బస్టాండ్‌లో దిగినట్లు తెలిపాడు. బాలుడిని వెతకటంలో విశేష ప్రతిభకనబర్చిన సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్‌బాషాలను, పోలీస్ బృందాన్ని డీఎస్పీ మొయిన్ అభినందించారు.



తప్పిపోయిన బాలుడు, సీఐ ఎస్సైని అభినందిస్తున్న డీఎస్పీ మొయిన్

పెనుగొండకు అవార్డు ప్రశంసనీయం

నరసరావుపేట: ప్రముఖ అభ్యుదయ రచయిత, కవి, విమర్శకుడు, అరసం జాతీయనేత, న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక కావడం పల్నాడు జిల్లా సాహితీ లోకానికి గర్వకారణమని అశ్లీలతా ప్రతిఘటనా వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పెనుగొండ బహుముఖ ప్రజ్ఞాశాలి. అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో చురుకైన కార్యకర్తని కొనియాడారు. 1989లో అశ్లీలతా ప్రతిఘటన వేదిక ఏర్పాటు, 1995 ప్రాంతంలో అప్పటి అశ్లీల నవలా రచయితలపై కోర్టులో కేసు వేసి నోటీసులు జారీచేసి వారిని కాళ్ళబేరానికి రప్పించి అశ్లీల నవలలు రాయబోమని లిఖితపూర్వక హామీలు ఇప్పించుటలోనూ, విరసం రుక్మిణితోపాటు పెనుగొండ కీలక పాత్ర పోషించారని గోపీచంద్ తెలిపారు. అశ్లీల డాన్సులను ప్రతిఘటించటంలోనూ, గ్రంథాలయాల నుంచి ఏడు అశ్లీల నవలలను నిషేధింపజేయడంలోనూ ప్రముఖ పాత్ర పోషించారని ప్రశంసించారు. ఈ ఏడాది ఆరంభంలో తాను వెలువరించిన 'కామోత్సవ దహనం' పుస్తకాన్ని కొత్తపల్లి రవిబాబుతో పాటు పెనుగొండ సహ సంపాదకత్వం వహించారని గోపీచంద్ గుర్తు చేశారు. శ్రీ శ్రీ సాహిత్యం అంటే వీరాభిమాని అయిన పెనుగొండను ప్రధాన ఉపన్యాసకునిగా పిలిపించి నాటి పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సత్కరించారని పేర్కొన్నారు.

పోటాపోటీగా ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

గురజాల/గురజాల రూరల్ : పట్టణంలోనిపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎద్దుల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా గురవారం ఆరు పళ్ల జతలు పోటీలు పోటాపోటీగా సాగాయి. ఈ పోటీలను వైద్యుడు చల్లగుండ్ల శ్రీనివాస్ ప్రారంభించారు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పాతమల్లాయిపాలెంకు చెందిన సిద్దంశెట్టి సామ్రాజ్యం ఎద్దుల జత 5201.3 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం, కృష్ణా జిల్లా వెదుళ్లపల్లికి చెందిన వల్లభనేని మోహన్‌రావు, గుంటూరు జిల్లా మేడికొండురు మండలం పాలడుగుకు చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, శాఖమూరి విజయ పవన్ కుమార్ ఎడ్ల జతలు 5,000 అడుగుల దూరం లాగి రెండో స్థానం, గుంటూరు జిల్లా తూళ్లురుకు చెందన మోదుగుల రామిరెడ్డి, గుంటూరు జిల్లా కోల్లిపరకు చెందిన గుదిబండ మాధవ రెడ్డి ఎడ్ల జత 4,600 అడుగుల దూరం లాగి మూడో స్థానం సాధించాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన ఎడ్ల జత 4,324 అడుగుల దూరం లాగి నాలుగో స్థానం, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన లింగా ధరణీచౌదరి ఎడ్ల జత 4,256 అడుగులు లాగి ఐదో స్థానం, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంకు చెందిన కె.హుస్సేన్ ఎడ్ల జత 4,077 అడుగుల దూరం లాగి ఆరోస్థానం, పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్ల జత 4,000 అడుగుల దూరం లాగి ఏడో స్థానం కైవసం చేసుకున్నట్టు కమిటీ నిర్వహకులు తెలిపారు. శుక్రవారం నాలుగు పళ్ల జతల పోటీలు నిర్వహిస్తామని వివరించారు.



చల్లగుండ్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నిర్వాహ కులు

మిగిసిన క్రీడా పోటీలు



చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న విద్యార్థినుల బృందంతో ప్రిన్సిపల్ ఉషారాణి, పీడీలు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ వేదికగా జిల్లాలోని విద్యార్థినులకు రెండు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి 27వ బాలికల స్పోర్ట్స్-గేమ్స్ మీట్ గురువారం ముగిసింది. సత్తా చాటిన గుంటూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ చాపియన్‌షిప్ సాధించింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ఉషారాణి మాట్లాడుతూ... క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణతో విద్యార్థినులు రాణించారని అన్నారు. తమ కళాశాలకు ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు వ్యక్తిగత విభాగంలోనూ చాంపియన్‌షిప్ దక్కిందని వివరించారు. వ్యక్తిగత విభాగంలో ఈసీఈ విద్యార్థిని కె. నవ్య విజేతగా నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా వివిధ విభాగాల వారీగా ఖో-ఖోలో గుంటూరు మహిళా పాలిటెక్నిక్, వాలీబాల్‌లో సెయింట్ మేరీస్, బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో సాయి తిరుమల, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సెయింట్ మేరీస్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో హిందూ కళాశాల, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో గుంటూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విన్నర్లుగా నిలవడంతోపాటు అథ్లెటిక్స్‌లో బహుమతులు గెలుచుకున్నారని చెప్పారు. దీంతో పాటు పాలిటెక్నిక్ కళాశాలల్లోని సిబ్బందికి నిర్వహించిన టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీల్లో పాన్నూరు, గుంటూరు కళాశాలలు విన్నర్స్, రన్నర్లుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శికి కార్మికుల వినతి



యువరాజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు, నాయకులు గురువారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజన్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ... 2014లో కోర్టు ఆదేశాల ప్రకారం యజమానులు దాదాపు రూ.42.93 కోట్లు కార్మికులకు చెల్లించాల్సి ఉందన్నారు. ఆ మొత్తానికి 12 శాతం వడ్డీని కలిపి రెండు నెలల్లో ఇవ్వాలని కోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీలో 333 మంది కార్మికులు ఉండగా, దాదాపు సగం మంది అనారోగ్యం, అర్ధాకలితో మృతి చెందారని తెలిపారు. ఒకప్పుడు ఎంతో ఘనంగా బతికిన కార్మికులు నేడు ఆర్థిక బాధలతో, కుటుంబ పోషణ కోసం తమకు నైపుణ్యం లేని పనులకు వెళ్తూ కడుపు నింపుకొంటున్నారని యువరాజన్‌కు వివరించారు. తగిన న్యాయం చేస్తానని యువరాజన్ హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు. ఏసీసీ పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ.. పీఎఫ్, పెన్షన్ తదితర కార్మికులకు రావాల్సిన న్యాయమైన డిమాండ్లపై హెచ్ఎంటీ తరఫున ఎం.బాలాజీ సంతకాలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎస్పీ యాజమాన్యం ఆయనకు అధికారం ఇచ్చిందని తెలిపారు. యువరాజన్‌ను కలిసిన వారిలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి. నాగేశ్వరరావు, తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, కె. ఆదినారాయణ, బి.అంకయ్య, వై.సాంబయ్య, ఎం.ఆశీర్వాదం, వై.యహోషువా, బి.సూర్యప్రకాష్ తదితరులు ఉన్నారు. కార్మికులు చేస్తున్న దీక్షలో షంషుద్దీన్, రామారావు, బి.నవనీతం, వి.లక్ష్మి, రమాదేవి, దుర్గాభవాని, రిబిక, సాంబశివరావు, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్ఎం అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగిరెడ్డి



సత్తెనపల్లి: ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్(ఏపీపీఎస్ఎం) అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్తెనపల్లికి చెందిన భవనం నాగిరెడ్డి, రాష్ట్ర అడ్వైజర్‌గా క్రోసూరుకు చెందిన తిప్పిరెడ్డి జైనేంద్రారెడ్డి ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సత్తెనపల్లి, పెద్దకూరపాడు నియోజకవర్గాల ప్రైవేట్ పాఠశాల డైరెక్టర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీజే ధన్ హాజరై మాట్లాడారు. ఈనెల 29న కేఎల్ యూనివర్సిటీలో రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ సమావేశం విజయవంతంపై చర్చించారు. సమావేశానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరవుతారని, ప్రైవేటు పాఠశాలల సమస్యలపై చర్చిస్తారని వెల్లడించారు. సత్తెనపల్లి పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రవేటు పాఠశాల డైరెక్టర్లు అందరూ హాజరు కావాలని కోరారు. జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎంపికైన భవనం నాగిరెడ్డి, రాష్ట్ర అడ్వైజర్‌గా ఎంపికైన తిప్పిరెడ్డి జైనేంద్రారెడ్డిలను సత్కరించి అభినందించారు. సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



మరణించిన ఇర్ల శంకర్

నరసరావుపేటటౌన్/నరసరావుపేట: విద్యుత్‌దాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పెద్ద చెరువు ఏడో లైనుకు చెందిన ఇర్ల శంకర్(17) తెల్లవారుజామున టీ తాగేందుకు ఇంటి నుంచి బజారుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో రోడ్డుపై తెగి పడి ఉన్న విద్యుత్ తీగను పక్కకు తొలగించేందుకు పట్టుకున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు, ఎస్ఐ హరిబాబు, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అర్ధరాత్రి విద్యుత్ తీగ తెగి పడటంతో దాన్ని పట్టుకొని ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి తల్లి ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ.పదిలక్షలు నష్టపరిహారం అందించాలి

విద్యుదాఘాతంతో మృతిచెందినన ఇర్ల శంకర్ కుటుంబానికి తక్షణమే రూ.10లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్‌లోని మార్చురీలో ఉన్న మృతదేహాన్ని గురువారం నాయకులతో కలిసి ఆయన సందర్శించి ఆ కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తక్షణ పరిహారం అందించాలని కోరారు. విద్యుత్ శాఖ ఏఈ ప్రకటించిన రూ.5లక్షల నష్టపరిహారం సరిపోదని పేర్కొన్నారు. గోపిరెడ్డి వెంట గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అచ్చి శివకోటి, వేముల శివ, షేక్ మాబు, తురక నాగుల్ మీరా, కోట చిన్నబాబు, అవార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

మార్కెట్ ఫీజు వసూళ్లు పెరగాలి

కొరిటిపాడు(గుంటూరు): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను మార్కెట్ యార్డులు, చెక్‌పోస్టులకు నిర్దేశించిన ఫీజు వసూళ్ల లక్ష్యాలు వంద శాతం సాధించాలని సంబంధిత అధికారులను మార్కెటింగ్‌శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) కాకుమాను శ్రీనివాసరావు ఆదేశించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల మార్కెట్ కమిటీల కార్యదర్శులు, మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులతో చుట్టగుంటలోని ఏడీఎం కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. 28 మార్కెట్ యార్డులు, 75 చెక్‌పోస్టుల పనితీరు తెలుసుకున్నారు. ఆర్జేడీ మాట్లాడుతూ వచ్చే మార్చి చివరి నాటికి అన్ని మార్కెట్ కమిటీలు వంద శాతం లక్ష్యాలను సాధించాలని సూచించారు. మార్కెట్ కమిటీల్లోని గోదాములలో రైతుల ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. గోదాముల నుంచి అద్దె బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే పత్తి కొనుగోలు చేస్తున్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కు కూడా మార్కెట్ ఫీజు కోసం డిమాండ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకులు కె.ఝాన్సీరాణి, శ్రీనివాసులు, గుంటూరు ఏడీఎం బి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ శ్రీనివాసరావు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ రాజధాని అమరావతి పరిధిలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తాడికొండ క్రాస్‌రోడ్స్ దగ్గర పొన్నెకల్లు నందు 40ఎకరాల APCRDA అప్రూవ్ నూతన గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ నందు ప్రీమియర్ ఓపెన్ ప్లాట్స్ కలవు. లాంచింగ్ ఆఫర్ కలదు. సంప్ర॥ 9573625599

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సలహాలకు సంప్రదించండి : 7297898678.

BUSINESS OFFER

■ నిరుద్యోగులకు, గృహిణులకు, రిటైర్డ్ ఎంప్లాయిస్, వ్యాపారస్తులు ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం వర్క్ చేయడం వలన మంచి ఆదాయం సంపాదించుకోవచ్చు ఆసక్తి గలవారు సంప్ర: 9100228505

■ Franchise Offer on Abroad Study & Job Agency Interested people can contact for more details WhatsApp 9492251262

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED

■ గుంటూరు మరియు పల్నాడు జిల్లాలలో పనిచేయుటకు మెడికల్ డెలివరీ బాయ్స్ & లేడీ టెలికాలర్స్ అభ్యర్థులు కావలెను. ✆7730997214

■ జంగంటపాలెం, పేరేచర్ల, గుంటూరు ఆటోనగర్ లలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జంటుగా కావలెను. ఆకర్షణీయమైన జీతం. అ:5th-ఇంటర్ ✆7386585946, 7386743664

■ ప్రముఖ నర్సింగ్ కాలేజీలో పనిచేయుటకు B.Sc Nursing Teaching Staff మరియు వాచ్‌మెన్ కావలెను. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్: 8122481164, 7032710958

■ Wanted Male Campus Admin Incharges Qualification any Degree. Age Limit: 25 to 45 years (Must be Married) Salary upto: 25000/- Working Location Master Minds College, Guntur. Contact: 8978480430

■ ప్రముఖ దంత వైద్యశాల నందు పని చేయుటకు మార్కెటింగ్ Staff మరియు డ్రైవర్, హౌస్‌కీపింగ్ Staff కావలెను. సంప్ర: 95154 15343

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటివద్దనే వుంటూ ఒక గంట పార్ట్ టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ / పు॥ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వివరాలకు వాట్సాప్ చేయండి. 98856 82589

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీలో వర్క్ చేయుటకు మార్కెటింగ్ టీమ్స్, మార్కెటింగ్ టీమ్ లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ M/F కావలెను. జీతం:15k+ ✆7205583999, 9030110144

■ రియల్‌ఎస్టేట్ ఏజెంట్లకు అద్భుతమైన అవకాశం. ఒక సంవత్సరం పనిచేయండి. జీవితాంతం ఆదాయాన్ని పొందండి. వివరాలకు సంప్ర: 9888084333

■ బిజినెస్ మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై నైపుణ్యం, 3సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, రెజ్యూములను hoadvtjobs@gmail.com కు పంపగలరు.

■ గుంటూరు, అమరావతి రోడ్డులోని పెట్రిస్ లేడీస్ బ్యూటీ పార్లర్ & ట్రైనింగ్ సెంటర్ నందు పని చేయుటకు లేడీ స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి: 86390 74326.

■ చిలకలూరిపేట దగ్గర గల ఫ్యాక్టరీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. శ్రీ రాజరాజేశ్వరి సెక్యూరిటీ సర్వీసెస్. సెల్ : 80082 02789, 70325 59533.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్
రూ.475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.